

పాలకుర్తిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు

# ముగిసిన పోలింగ్

- ఉత్సాహంతో తొలి ఓటు హక్కును వినియోగించుకున్న యువత
- జాతర వాతావరణం తలపించిన పల్లెలు
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- సౌకర్యాలు కల్పించిన అధికారులు
- ఓటింగ్ సరళిని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, నవంబర్ 30 : మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గురువారం జరిగిన ఎన్నికలతో జాతర వాతావరణం కనిపించింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు యువత ఉత్సాహం చూపారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపాధి, ఉద్యోగాలు, ఉన్నత చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు గురువారం పాలకుర్తి మండలంలో జరిగిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**తొలి ఓటు హక్కును వినియోగించుకున్న యువత**

తొలి సారిగా ఓటు హక్కు రావడంతో ఉత్సాహంతో యువతీయువకులు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలిసారిగా ఓటు హక్కును వినియోగించడం ఆనందంగా ఉందని పలువురు యువతీయువకులు చెప్పారు. మండల వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది. కాగా, మండలంలో పోలింగ్ సరళిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యవేక్షించారు. నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి ఓటింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్దేపల్లిలో ఎర్రబెల్లి చారిటుబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు పోలింగ్ సరళిని పరిశీలించారు. కాగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 81.23శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం వరకు కూడా పోలింగ్ కొనసాగింది.



పాలకుర్తి : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రశాంతంగా ముగిసిన పోలింగ్..**

కొడకండ్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 81.23 శాతం పోలింగ్ శాతం నమోదైనట్టు ఎన్నికల అధికారి మందాడపు రామారావు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

**దేవరుప్పలలో..**

దేవరుప్పుల : అసెంబ్లీ ఎన్నికలు మండల వ్యాప్తంగా గురువారం ప్రశాంతంగా జరిగాయి. 40పోలింగ్ బూత్‌లు ఉండగా 36,051మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 18,140, మహిళలు 17,911మంది ఓటర్లు ఉన్నారు. ఈ సారి కొత్త ఓటర్లు ఎక్కువగా కనిపించగా ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. 32,177ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ 89శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**మూడు గ్రామాల్లో స్వల్ప గొడవలు**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం దేవరుప్పుల మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరుగగా దేవరుప్పుల, కోలుకొండ, నీర్మాల గ్రామాల్లో స్వల్ప ఉద్రికత్తలు, గొడవలు జరిగాయి, దేవరుప్పులలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారికి భత్యాలు ఇవ్వడానికి పీఆర్ ఏఈ ఎన్నిలక విధుల్లో ఉన్న వాహనంలో డబ్బులు తేగా వాటిని ఓటర్లకు పంచడానికి తెచ్చారని కాంగ్రెస్ వర్గాలు రాద్ధాంతం చేశారు. పంచాయతీరాజ్‌లో ప్రైవేట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్న కారుపోతుల సందీప్ ఈ డబ్బులు పట్టుకోవడం ఈ రాద్ధాంతానికి కారణమైంది. ఈ డబ్బులు ఓటర్లకు పంచడానికి బీఆర్ఎస్ నాయకులు తెచ్చారని కాంగ్రెస్ నాయకులు పోలీసులతో వాదించారు. ఎట్టకేలకు అధికారులు రుజువులు చూపించడంతో గొడవ సద్దుమణిగింది. కోలుకొండలో ఓటు వేయడానికి వచ్చిన ఓటరు తాగి రావడంతో గొడవకు కారణమైంది. నీర్మాలలో కాంగ్రెస్‌కు చెందిన రెండో గుర్తు పనిచేయడంలేదని కాంగ్రెస్ నాయకులు అధికారులతో గొడవకు దిగారు.



దేవరుప్పుల : నీర్మాలలో మొదటి సారి ఓటు వేసిన యువత





పాలకుర్తి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరిన ఓటర్లు

## రాయపర్తిలో 85శాతం పోలింగ్



రాయపర్తి : కాట్రపల్లిలో పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన మహిళా ఓటర్లు

రాయపర్తి : మండల వ్యాప్తంగా 52పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్ర శాసన సభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం వేళ పోలింగ్ కేంద్రాల వద్ద జనాలు లేకపోవడంతో పోలింగ్ స్టేషన్‌లు బోసిపోయి కన్పించాయి. మధ్యాహ్నం 1గంట నుంచి పోలింగ్ వేగం పుంజుకుంది. పోలింగ్ శాతం 85శాతం మించడం విశేషంగా చెప్పవచ్చు. మండలంలోని పెర్కవేడు, మైలారం, బురహాన్‌పల్లి, కాట్రపల్లి, పోలింగ్ కేంద్రాలను పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు సందర్శించారు. మండలంలోని మైలారం, పెర్కవేడు గ్రామాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పోటీలు పడి నినాదాలు చేసుకుంటూ భౌతిక దాడులకు దిగే పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. దీంతో గొడవ సద్దుమణిగింది.



తొర్రూరు : మాటేడులో వీల్ చైర్‌లో ఓటు కోసం వస్తున్న మహిళలు

## తొర్రూరులో ప్రశాంతంగా పోలింగ్

**ఓటింగ్ సరళిని పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి**

తొర్రూరు నవంబర్ 30 : తొర్రూరు మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం వరకు జోరు అందుతుంది. తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటింగ్ సరళిని పరిశీలించారు. వెలికట్టెలో ఈవీఎంలు మొరాయించిన్నప్పటికీఅధికారులు సరిచేయడంతో ఓటింగ్ యథావిధిగా నిర్వహించారు. హరిపిరాలలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు ఓటర్లు ఉన్నారు. నూతన ఓటర్లు ఉత్సాహంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



వడ్డెకొత్తపల్లిలో ఓటు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు

## సాంకేతిక సమస్యతో పోలింగ్ ఆలస్యం

పెద్దవంగర : తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా సాగాయి. మండలంలోని 20గ్రామాల్లో 31పోలింగ్ కేంద్రాలు ఉండగా ముగ్గురు సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది 130మందిని నియమించారు. అవుతాపురం 148పోలింగ్ కేంద్రం, గంట్లకుంటలో 142, 143 కేంద్రాల్లో ఈవీఎంల సాంకేతిక సమస్యతో మాక్ పోలింగ్‌తో పాటు పోలింగ్ సైతం 2గంటల ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుతోపాటు కుటుంబ సభ్యులు, గంట్లకుంటలో పాలకుర్తి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పులిగిల్ల భిక్షపతి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంట్లకుంటలో ఓటర్లు 6:30గంటలకు సైతం బారులు తీరారు.



చిన్నవంగరలో బారులుతీరిన ఓటర్లు



రాయపర్తి : వయో వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి స్వయంగా తోడ్కొని వెళ్తున్న ట్రైనీ ఎస్సై సాయిని నవిత